రైలు ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు

- ఒకే మార్గంతో సమస్య జటిలం
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న పట్టణవాసులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో రైలు ప్రయాణం అంటే ప్రజలు హడలిపోతున్నారు. స్టేషన్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌తో నరకం కనిపిస్తుందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఉన్న రైల్వేస్టేషన్‌కు పాలకొల్లు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా దాదాపుగా 50 కి.మీటర్ల దూరం నుంచి ప్రయాణికులు ఇక్కడకు వచ్చి రైలు ప్రయాణం చేస్తుంటారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే లాకు సెంటర్ మార్గంలో ఎప్పుడూ ట్రాఫిక్ నిలిచి పోతుందని ప్రజలు వాపోతున్నారు. పాలకొల్లుకు తూర్పుగోదావరి కోనసీమ జిల్లా అమలాపురం, రాజోలు, నగరం, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట నియోజకవర్గాల నుండి ప్రయాణికులు పాలకొల్లు రైల్వే స్టేషన్‌కు వస్తుంటారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడ నుంచి రావాలన్నా సుమారు 20 నుండి 50 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ప్రతీరోజు తెల్లవారుజామున 3.30 గంటల నుండి రాత్రి 12.40 గంటల వరకూ సుమారు 14 ట్రైన్‌లు వెళుతు, వస్తూంటాయి. ముఖ్యంగా మద్యాహ్నం 11.25 గంటల సమయంలో నాగర్‌సోల్, సాయంత్రం 5.50 గంటలకు తిరుపతి (ధర్మవరం), రాత్రి 7 గంటల సమయంలో సికింద్రాబాద్ (లింగంపల్లి) ఈ మూడు రైళ్ల సమయాల్లో మాత్రం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్లాట్‌ఫామ్ మార్పుతో ఇబ్బందులు

ఒక్కోసారి గేటు వేసిన తరువాత వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గేటు వేయడం వల్ల ట్రాఫిక్ ఆగిపోతుందని, దాంతో ఆ సమయంలో హడావుడిగా వచ్చే రైల్వే ప్రయాణికులు స్టేషన్ రోడ్డులోకి వెళ్లడానికి వాహనాలు అడ్డం ఉండడంతో ట్రైన్ మిస్ అవుతుందని వాపోతున్నారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్లో మూడు ఫ్లాట్‌ఫారాలు ఉన్నాయి. ఇందులో మూడవ ఫ్లాట్ ఫారం గూడ్స్ రైలు నిలుపుదలకు ఉపయోగిస్తుంటారు. మిగిలిన రెండు ఫ్లాట్‌ఫారంలలో ఒకటో



రైల్వే గేటు వద్ద గేటు వేసే సమయంలో స్తంభించిన ట్రాఫిక్

వచ్చే ట్రైన్‌లకు రెండవ ఫ్లాట్ ఫారం వెళ్లే రైళ్లకు ఉపయోగిస్తున్నారు. దానివల్ల వెళ్లే ప్రయాణికులు రైల్వే స్టేషన్ నుంచి మెట్లు లేదా లిఫ్ట్ ఎక్కి వెళ్లాల్సి ఉంటుంది. కొందరు లగేజీతో మెట్లు ఎక్కలేక లిఫ్ట్ కోసం జనం ఎక్కువగా ఉండడంతో చేసేది లేక గేటు దాటి లజపతిరాయ్ పేట నుంచి ఎఫ్‌సీఐ గొడౌన్ ఎదురుగా ఉన్న మార్గంలో రెండవ ఫ్లాట్ ఫారం వద్దకు చేరుకుంటున్నారు. ఇది రైల్వే నిబంధనలకు విరుద్ధమైనా గానీ 90 శాతం ప్రయాణికులు ఈ మార్గాన్నే ఎక్కువగా ఎంచుకుంటున్నారు. హడావుడి లేకుండా సాఫీగా ప్రయాణం సాగాలంటే రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి మరో మార్గం ఏర్పాటుచేయాలని అలాగే వెళ్లే రైళ్లు 1వ ఫ్లాట్‌ఫామ్ లోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఒక్కమార్గంతో ఇబ్బందులు

రైల్వే నిబంధనసల ప్రకారం ప్రతి స్టేషన్‌లో ఒక్క మార్గమే ఉండాలనే ఉద్దేశంతో రైల్వే అధికారులు స్టేషన్‌కు ఉన్న దారులన్నీ మూసివేస్తున్నట్లు సమాచారం. దానిలో భాగంగా పాలకొల్లు రైల్వే స్టేషన్‌కు స్టేషన్ సమీపంలో ఈశాన్య భాగంలో రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి నాగరాజు పేట నుంచి కాగా రెండవది బిఆర్‌ఎంబి హైస్కూల్ నుండి మార్గాలు ఉన్నాయి. ఒకవేళ రైల్వే అధికారులు ఈ మార్గాల్లో తమ పరిదిలో ప్రహరి గోడ నిర్మాణం చేసేస్తే ప్రయాణికులు రెండవ మార్గం లేక



మూసి ఉన్న రైల్వే స్టేషన్‌కు ఈశాన్యం వైపున ఉన్న మార్గం

రాబోయే రోజుల్లో మరింత తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది.

ప్రత్యేక రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

పట్టణంలోని కొందరు ప్రముఖులు రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి మరో మార్గం చూపిస్తే బాగుంటుందని సలహా ఇస్తున్నారు. ఈ మార్గం కూడా ప్రస్తుతం పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న బీఆర్‌ఎంవీ మునిసిపల్ హైస్కూల్ రోడ్డు నుండి ఒకటి అలాగే నాగరాజు పేట నుంచి బ్రహ్మానందరెడ్డి కాలనీ మీదుగా గూడ్స్ షెడ్ రోడ్డు ఇది 60 అడుగుల రోడ్డు కావడం గమనార్హం. ఈ రోడ్డు రైల్వేస్టేషన్‌కు ఈశాన్యం మూలకు వస్తుంది. అలాగే బీఆర్‌ఎంవీ స్కూల్ నుండి వెళితే రైల్వే సైకిల్ పార్కింగ్ ఏర్పాటుచేసే రోడ్డు వద్దకు చేరుకుంటారు. వీటిని అభివృద్ధి చేస్తే రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ప్రయాణికులకు కొంత వరకూ మార్గం సులభంగా ఉంటుందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



సాయంత్రం రైళ్లు వెళ్లే సమయానికి స్కూల్, కళాశాల బస్సులతో పాటు అన్ని ప్రాంతాల నుంచి ఒకేసారి ప్రయాణికులు రావడం, వ్యాపార సంబంద వాహనాలతో ట్రాఫిక్‌తో కొంత సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆ సమయంలో ప్రతి సర్కిల్‌లో కానిస్టేబుల్స్‌ను ఏర్పాటుచేస్తున్నాము. స్టేషన్ ఎదురుగా ఉన్న బీఆర్‌ఎంవీ స్కూల్ నుండి రైల్వే స్టేషన్‌కు మార్గం ఏర్పాటుచేస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఒకసారి ట్రాఫిక్ నిబంధనలు పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాము.

– కోలా రజనీకుమార్, పట్టణ సిఐ, పాలకొల్లు

రైల్వే అధికారుల దృష్టికి..



ప్రజల డిమాండ్ మేరకు ఇటీవల విజయవాడలో జరిగిన డీఆర్‌యూసీసీ సమావేశంలో డివిజినల్ రైల్వే మేనేజర్‌తో చర్చించాం. రైల్వే నిబంధనల ప్రకారం ప్రతి స్టేషన్‌కు ఒకటే మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మన ప్రాంతంలో ట్రాఫిక్ ఎక్కువ కావడంతో మరో మార్గం ఏర్పాటు చేయాలని సూచించాం. రైల్వే అధికారులు పర్యవేక్షణ చేసిన అనంతరం దీనిపై చర్చిస్తాం. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ సభ్యులు సహకారంతో మరో మార్గం ఏర్పాటుకు కృషి చేస్తాం.

– జక్కంపూడి కుమార్, రైల్వే డిఆర్‌యుసిసి మెంబర్, పాలకొల్లు

క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన తరగతుల్లో మాట్లాడుతున్న డాక్టర్ డి.సాంబమూర్తి

నరసాపురం: నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో శనివారం పిల్లలకు నీతి కథలు చెప్పారు. అలాగే పిల్లలకు అనుభవజ్ఞులైన తెలుగు అధ్యాపకులు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, యోగా, చెస్ వంటి ఆటలు నేర్పించారు. పట్టణంలోని ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డి.సాంబమూర్తి కంటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులకు మంచి స్పందన వస్తోందని, ప్రతిరోజూ తరగతులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములదీవి వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వరస్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి విశేష సేవలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన వాసవిక్లబ్ కోశాధికారి, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు కోట్ల బాలకృష్ణ, అరుణ కుమారి దంపతుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


ప్రేమ్‌చంద్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఉన్నమట్ల ప్రేమ్‌చంద్

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన లవ్ పీపుల్ ఫౌండేషన్ సేవా సంస్థ చైర్మన్, రచయిత, దళిత అభ్యుదయ వాది ఉన్నమట్ల ప్రేమ్‌చంద్‌కు కేరళ రాష్ట్రానికి చెందిన కంకారిడియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. యూనివర్సిటీ బిషప్ రాబిన్‌సన్ డేవిడ్ చేతుల మీదుగా శనివారం ప్రేమ్‌చంద్ డాక్టరేట్ అందుకున్నారు. ప్రేమ్ కుమార్ లవ్ పీపుల్ ఫౌండేషన్ సేవా సంస్థను స్థాపించి గత 14 సంవత్సరాలుగా నిర్విరామంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు ప్రధానం చేశారు. ప్రేమ్‌కుమార్‌కు డాక్టరేట్ రావడం పట్ల పలువురు సామాజిక సేవా కార్యకర్తలు, బహుజన రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

పాడి పశువుల పెంపకానికి సబ్సిడీ రుణాలు



పశువైద్య శాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: పాడి పశువుల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం నడిపూడిలో రూ.26.50 లక్షలతో నిర్మించిన పశువైద్య శాలను ప్రారంభించారు. రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు మామిడిశెట్టి కట్టమ్మ, మానుకొండ సాయిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుమంట్ర: పాలకొల్లు రోడ్డు లోని మార్టేరు పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు డైవర్షన్ కోసం వేసిన బారికేడును ఢీకొట్టి పోడూరు మండలం కవటం గ్రామానికి చెందిన పులగం సత్యనారాయణరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 పైలెట్ బాలకృష్ణ సంఘటన స్థలానికి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న సత్యనారాయణ రెడ్డికి ప్రథమ చికిత్స అందించి 108 వాహనంలో పాలకొల్లు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడ నుంచి విజయవాడలోని ప్రవేశ హాస్పిటల్ తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

రేపు మిస్ నరసాపురం పోటీలు

నరసాపురం: ఆర్‌వీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని తెలగ కల్యాణమడపంలో మిస్ నరసాపురం, మిసెస్ నరసాపురం పోటీలు నిర్వహిస్తోన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు మిస్ నరసాపురం పోటీల్లో, 26 నుంచి 56 వయస్సు కలిగిన మహిళలు మిసెస్ నరసాపురం పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత చీరలు ధరించి మాత్రమే పోటీల్లో పాల్గొనాలని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 75699 87919 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గోదావరి గట్టుపై రెయిలింగ్ ధ్వంసం

నరసాపురం: పట్టణంలో గోదావరి గట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధ్వంసమైయ్యింది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో రెయిలింగ్‌ను గట్టు వెంబడి నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధ్వంసమైంది. అలాగే ఆ సమయంలో నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైయ్యింది. కొంతమేర రెయిలింగ్ చోరీకి కూడా గురవుతోంది. దీంతో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా ఈ సమస్య దృష్టి పెట్టి పరిష్కరించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

బహుజన నేత చింతపల్లికి అభినందనలు

పెనుగొండ: దళిత , బహుజన సమస్యలపై అనేక పోరాటాలు చే సి మన్ననలు పొందిన చింతపల్లి గురుప్రసాద్ డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని ఆచంట నియోజకవర్గ మాల సంఘాల జేఏసీ చైర్మన్ సుంకర సీతారామ్ అన్నారు. శనివారం డాక్టర్ చింతపల్లి గురుప్రసాద్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కన్వీనరు మట్టారాము, జేఏసీ నాయకులు కోట వెంకటేశ్వరరావు, జెంట్రీ శ్రీను, ఉన్నమట్లమునిబాబు, పోతుమూడి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నియంత్రణ లేని ఆటోలు

నరసాపురం: పట్టణంలో ఆటోల సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. ఆటోలను ఇష్టానుసారం రోడ్ల మీదే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మితిమీరిన వేగంతో ఆటోలను తిప్పడం, కనీస వయస్సులేని చిన్నచిన్న పిల్లలు సైతం ఆటో డ్రైవర్ల అవతారం ఎత్తడంతో ప్రతి రోజూ ఆటోల కారణంగా ఏవో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. పట్టణంలో దాదాపు 400 పైగా ఆటోలున్నాయి. అయితే ఆటోలను నిలిపి ఉంచడానికి ప్రత్యేకంగా ఎక్కడా స్టాండ్స్ లేకపోవడం ఇబ్బందులను తెచ్చి పెడుతుంది. ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపి ఉంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్, గుర్రపుబళ్ల స్టాండ్, ఎందుచేపల మార్కెట్ ప్రాంతాల్లో ఆటోల సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఆటోలను రోడ్ల మీదే నిలిపి ఉంచుతున్నారు.



మొగల్తూరు రోడ్డులో ఇష్టానుసారం నిలిపి ఉంచిన ఆటోలు

రద్దీగా ఉండే బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్ వద్ద ఆటోలు కారణంగా ప్రమాదాలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల కొత్తగా గడ్డిబజార్ సెంటర్, కనకదుర్గ ఆలయం వద్ద కూడా ఇష్టానుసారం ఆటోలు నిలుపుతుండడంతో స్థానికులు, అటుగా వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్‌శాఖ దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

శ్రీరంగనాథరాజుకు అభినందనల వెల్లువ

పెనుగొండ: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అడ్వైయిజరీ కమిటీ సభ్యులుగా నియమితులైన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును ఆచంట నియోజకవర్గ నాయకులు అభినందించారు. శనివారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఘనంగా అభినందించారు. రాష్ట్రంలో ఆచంట నియోజక వర్గానికి ప్రత్యేక గుర్తింపునిచ్చారన్నారు. ఈ సందర్భంగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులపై ఎటువంటి దాడులు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు జరిపేవిధంగా ఒత్తిడి తీసుకురావడానికి పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, పార్టీనాయకులు కర్రి వేణుబాబు, గుబ్బల వీర బ్రహ్మం, పలివెల శ్రీను, చిటికెన బాబీ, నల్లిమిల్లి బాబి రెడ్డి, రాపాక చిట్టిబాబు, బుర్రా రవికుమార్, ఏసురత్నం, కేశరపల్లి గణపతి, పులిదిండి వెంకటేశ్వరరావు, మద్దు శ్రీనివాసరావు, బండారు దుర్గా ప్రసాద్, కోట వెంకటేశ్వరరావు, కొవ్వూరి చిన్న, దేవేంద్రుడు, సుంకర నాగబాబు, ముత్యాల నాగేశ్వరరావు, కుక్కల కిరణ్ కుమార్, పెచెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో శ్రీరంగనాథరాజును అభినందిస్తున్న నాయకులు



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో పాలకొల్లు నాయకులు

మర్యాదపూర్వకంగా కలసిన పాలకొల్లు నాయకులు

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును పాలకొల్లు వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూరకంగా కలిశారు. శనివారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పోడూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొర్రపాటి వీరాస్వామి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మునసబు కుటుంబానికి పరామర్శ

ఇలపర్రు మాజీ మునసబు పెన్మెత్స వెంకట సత్య సూర్య గోపాలరాజు కుటుంబాన్ని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం పరామర్శించారు. మాజీ మునసబు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, వేగిరాజు శ్రీనివాసరాజు, చేకూరి నరసింహరాజు, దిడ్ల వెంకట్రావు, కోలాటి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వంతెన అప్రోచ్ ప్రమాదకరం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వెలమగూడెం ప్రాంతంలో ఉన్న వంతెన అప్రోచ్ ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం వెలమగుడెం నుంచి వస్తున్న ఓ వ్యాన్ వంతెన పక్కనే ఉన్న డ్రెయిన్‌లోకి దిగిపోయింది. దానితో స్థానికులు సహాయం చేస్తూ వ్యాన్‌ను పైకి గెంటుతున్నారు. దీనికి కారణం లోడుతో ఉన్న వాహనాలు నేరుగా వంతెన ఎక్కాలంటే అప్రోచ్ గోడుగా ఉండడంతో టైర్లకు గట్టిగా తగలడం లేదా ఎత్తు ఎక్కలేక పోవడం జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దానితో వాహనదారులు వంతెనకు పక్క నుంచి ఎక్కాలని ప్రయత్నిస్తున్నారు.



ప్రమాదకరంగా సిమ్మెంట్ లోడుతో ఉన్న వాహనం

దానితో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వంతెన అప్రోచ్ పనులు పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

యోగాతో ఆరోగ్యం

పెనుగొండ: నిత్యం యోగా చేయడం వలన ఆరోగ్యం సమకూరడంతో పాటు, మానసిక ఉత్సాహం పెరుగుతుందని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెనుగొండలో నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాన్ని పెనుగొండ బీసీ కమ్యూనిటీ హాలులో ప్రారంభించారు. యోగా మాసోత్సవాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి టి రత్నాకరరావు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

వడలిలో..

వడలిలో యోగాంధ్ర 2025ను శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. యోగా ఆవశ్యకతను వివరించి ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించాలని పిలుపునిచ్చారు.



పెనుగొండలో యోగా చేస్తున్న దృశ్యం

మౌలిక సదుపాయాలు కల్పించాలి



మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ నినాదాలు చేస్తున్న కాలనీ వాసులు

పెనుగొండ: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కు చొరవ చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం సిద్ధాంతం ఘటాల దిబ్బలోని జగనన్న కాలనీలో సమస్యలను పరిశీలించారు. ఈ ప్రాంతం వర్షం వస్తే చాలు మునిగిపోతుందన్నారు. అలాగే గుంతల్లో నీటి నిల్వలు పెరిగి విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. అధికారులు సత్వరం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఒంటరి బాలలను కిశోర వికాస్ గ్రూపులో చేర్చాలి

పెనుమంట్ర: సింగ్ పేరెంట్ ఉన్న బాల బాలికలను మహిళా పోలీసులు గుర్తించి కిషోర్ వికాస్ గ్రూపుల్లో చేర్చాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి బి.సుజాత రాణి అన్నారు. శనివారం పెనుమంట్ర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎ.కృష్ణకుమారి అధ్యక్షతన జీఎంఎస్‌కేలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సుజాతా రాణి వివిధ అంశాలపై ఐసీడీఎస్ సిబ్బందికి అవగాహన కల్పించారు.

ధాన్యం సొమ్ము కోసం రైతన్నల ఎదురుచూపులు



కల్లాల్లో ధాన్యం ఆరబెడుతున్న కూలీలు



మిల్లుకు ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు

యలమంచిలి: రైతులు తమ ధాన్యాన్ని వారికి ఇష్టమొచ్చిన మిల్లుకు తోలుకోవచ్చు.. ధాన్యం ఎగుమతి చేసిన తరువాత ట్రక్ షీట్‌తోపాటే ఎఫ్‌టీఓ జనరేట్ చేస్తాం.. ఎఫ్‌టీఓ జనరేట్ అయిన 48 గంటల్లో ధాన్యం సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. దాళ్వా కోతలు ప్రారంభం నుంచి ఇటు అధికారులు, అటు నాయకులు రైతుల చెవుల్లో ఈ విధంగా ఊదరగొట్టారు. తీరా వాస్తవ పరిస్థితి వచ్చే సరికి పూర్తి భిన్నంగా ఉంది. ఈ నెల 7వ తేదీ నుంచి ధాన్యం రైస్ మిల్లులకు తోలిన రైతులకు ఇంత వరకు డబ్బులు పడలేదు. ఇచ్చిన టోల్ ఫ్రీ నెంబర్లు పని చేయడం లేదు. అడపాదడపా పని చేసి రెండు రోజుల్లో డబ్బులు పడతాయనే సమాధానం మాత్రమే చెప్పి ఫోన్ కట్ చేసేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యలమంచిలి మండలంలో 5517 ఎకరాల్లో రైతులు దాళ్వా పంటకు వరి సాగు చేశారు. ఈ ఏడాది 17,500 టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంతవరకు 15,500 మెట్రిక్ టన్నుల ధాన్యం రైసు మిల్లులకు తోలారు. ఇంకా వెయ్యి టన్నుల వరకు ధాన్యం కల్లాల్లోనే ఉంది. ఈ నెల 7వ తేదీ తరువాత సుమారు వెయ్యి టన్నుల ధాన్యం రైస్ మిల్లులకు వెళ్లింది. వాళ్లలో ఒక్కరికి కూడా డబ్బులు పడలేదు.

ధాన్యం ముక్కవుతుందని..

రైతులు ఈ దాళ్వా పంటకు ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, ఎంటీయూ 1121, పీఆర్ 126 రకాలను సాగు చేశారు. ప్రభుత్వం ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాల ధాన్యానికి 75 కిలోల బస్తాకు రూ.1740, ఎంటీయూ 1121, పీఆర్ 126 రకాల ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1725లుగా ధర నిర్ణయించింది. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడవడంతో ధాన్యం ముక్కవుతుంది. ముఖ్యంగా ఎంటీయూ 1153రకం ధాన్యం ఎక్కు వగా ముక్కవుతుంది. ధాన్యం ముక్కవుతుందనే కారణంగా రైస్‌మిల్లర్లు 75 కిలోల బస్తాకు మూడు నుంచి నాలుగు కిలోల తగ్గించి ధాన్యం తీసుకుంటున్నారు. దీంతో రైతులు బస్తాకు సుమారు రూ. 100 వరకు నష్టపోతున్నారు. ఒకవైపు తోలిన ధాన్యానికి డబ్బులు ఇవ్వక, మరొక వైపు ధాన్యం ముక్కవుతుందనే కారణం చెప్పి బస్తాకు రూ.100 తగ్గించడంతో రైతులు రెండు విధాలుగా నష్టపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం సొమ్ములు చెల్లించడంతోపాటు తడచిన ధాన్యానికి కోతలు లేకుండా తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.